533) వసంతవరాళి

ప॥ ఏమందు మిందుకు నెఱిగినదే తొల్లి। శ్రీమాధవుడ నేవు సేసినదే తొల్లి॥

చ॥ వొక మాన జేదూ వొక మాన దీపూ। కకిపికలై రెండూ గలవే తొల్లి।
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము। సకలాన గలుగుట సహజమే తొల్లి॥

చ॥ పగలు వెలుఁగుపై పై రాత్రి చీకటి। నిగిడి లోకములని నిజమే తొల్లి।
మొగి సురలకు మేలు ముంచి దైత్యులకు గీడు। తగిలి నొాసలివ్రాత తప్పదిది తొల్లి॥

చ॥ వెన్నెలలు చంద్రునందు వెడ యెండ సూర్యునందు। కన్నుల లోకమువారు గన్నదే తొల్లి।
యెన్నగ శ్రీవేంకటేశ యేలినవాడవు నీవు। వున్నవారు నీకింద నున్నవారు తొల్లి॥